## భద్రాద్రి రాముడిని దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు జడ్జి



**భద్రాచలం కల్చరల్ , మార్చి 24, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని మద్రాస్ హైకోర్టు జడ్జి వి శివజ్ఞానం సోమవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ అర్చకులు పలు మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో పూజలు చేయగా అర్చకులు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆనంతరం ఆలయంలో ఉప ఆలయాలు శ్రీలక్ష్మితాయారు, శ్రీ అభయాంజనేయస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్, పట్టణ సీఐ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 25 | మార్చి | 2025 ◆ పేజీలు : 5



# దేవుడిపై....

2 లో..

# వివక్ష ఎలా భక్తుడా.?

- కష్టాల్లో రాములోరి గుడి.!
- పూజలకు నోచుకోని వైనం
- ఆలయంలో పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోవాలంటున్న భక్తులు

**టేకులపల్లి, మార్చి 24, ప్రజాజ్యోతి :** సాధారణంగా మనిషికి ఏమైనా కష్టం, ఇబ్బందులు, సమస్యలు ఉంటే వాటి నుంచి తమను కాపాడాలని దేవుడిని వేడుకోవడం సర్వసాధారణం. కానీ దేవుడికే సమస్య వస్తే ఎవరికీ చెప్పుకుంటాడో తెలియని పరిస్థితి. దేవుడిపై వివక్ష ఎలా భక్తుడా అని రాముడు అడిగే విధంగా ఉన్న రామాలయం పరిస్థితిని బాగు చేసేది ఎవరు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రామాలయం ప్రాంగణంలో గత కొన్ని రోజులుగా గుడిలో చెత్తాచెదారం పేరుకోవడం వలన పరిశుభ్రమైన వాతావరణంలో పూజలు సైతం చేయని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి ఇలా చూస్తుంటే కష్టాల్లో రాముడు గుడి ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుడి పరిస్థితి కొద్దిగా మెరుగ్గా ఉన్న రాను రాను గుడి పరిస్థితి, గుడి మెయింటెనెన్స్ చాలా దారుణంగా తయారవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కళ్లకు కట్టినట్టుగా చెత్తాచెదారం పేరుకపోవడం అధికారులకు గానీ, ప్రజా ప్రతినిధులకు గాని కనిపించడం లేదా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మనుషుల మధ్య ఎన్ని ఉన్నా మన ఊరిలో ఉన్న గుడి, బడి చక్కబెట్టుకుంటేనే ఊరు బాగుంటుందని పూర్వకాలంలో మన పెద్దలు మన

మిగతా 2 లో...



# గిరిజన సమస్యలు తక్షణమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలి..

- గిరిజన దర్బార్ లో పీవో రాహుల్

**భద్రాచలం, మార్చి 24, ప్రజాజ్యోతి :** సుదూర మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై గిరిజన దర్బార్లో సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన గిరిజనుల సమస్యలను యూనిట్ అధికారులు తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవాటిని వెంటనే పరిష్కరించి మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపి గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించేందుకు యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టాభూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థికసాయం, ట్రైకార్ సబ్సిడీ రుణాలు, ఇసుక సొసైటీల ఏర్పాటుకు, సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇప్పించడానికి, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక సాయం, గురుకులం సీట్లు,

మిగతా 2 లో...

## నమ్మి ముడుపులు కడితే ..

# కోరిన కోర్కెలు తీరినట్లే...

- పిలిస్తే పలుకుతున్న దేవుడు..కల్పవృక్ష శ్రీ నారసింహుడు
- ముడుపులు కట్టి పూజలు చేసిన తమిళనాడు జడ్జి



**భద్రాచలం కల్చరల్ , మార్చి 24, ప్రజాజ్యోతి :** భద్రాచలం లో కొలువై భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కల్పవృక్ష నారసింహ స్వామి వారి మహిమలు విని సోమవారం తమిళనాడు హైకోర్టు జడ్జి శివననన్ కుటుంబ సమేతంగా వచ్చి కల్పవృక్ష నారసింహ స్వామి వారికి ముడుపులు కట్టి ప్రత్యేక పూజలు చేయడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారి మహిమలు విని , దర్శనం కొరకు వచ్చామని,

మిగతా 2 లో...

# క్రీడాసామాగ్రికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం



**భద్రాచలం, మార్చి 24, ప్రజాజ్యోతి :** గిరిజన సంక్షేమశాఖ క్రీడా పాఠశాలలకు సరఫరా చేసే టీషర్టులు, షార్ట్, ట్రాక్ షూట్ క్రీడా సామాగ్రికి సంబంధించి టెండరు ప్రక్రియను ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం ప్రారంభించారు. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాచలం నుంచి ముగ్గురు ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేయగా తక్కువ ధరకు టెండరు కోడ్ చేయడంతో కమిటీ సభ్యుల సమక్షంలో ఆమోదించినట్లు పీవో తెలిపారు. టెండర్ల సమయంలో హెచ్ఎంలు శాంపిల్ ప్రకారం చూపిన టీషర్టు, షార్ట్, ట్రాక్సూట్ పరిశీలించి తీసుకోవాలని, క్రీడా దుస్తులు సరఫరా చేసే ఏజెన్సీదారులు నిబంధనలకు అతిక్రమించి ఇతర క్రీడా దుస్తులు సరఫరా చేసినట్లు మా దృష్టికి వస్తే ఏజెన్సీలు రద్దుచేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన విద్యార్థులకు మంచి విద్యతో పాటు చక్కని భోజనం మెనూ ప్రకారం అందించడమే కాకుండా క్రీడల్లో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, ఏటీడీవో అశోక్, జీసీసీ మేనేజర్ జయరాజ్, పీడీ, పీఈటీ, హెచ్ఎంలు, సిబ్బంది అశోక్, ఏజెన్సీదారులు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యలు తక్షణమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలి...



(మొదటి పేజీ తరువాయి...)
పై చదువులకు ఆర్థికసాయం కోసం అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గిరిజనదర్బార్లో వచ్చిన అర్జీలు ఆన్లైన్ చేయించి ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి ప్రతి గిరిజన కుటుంబానికి విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్రాజ్, డీడీ మణెమ్మ, ఎస్టీసీ రవీంద్రనాథ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, ఉద్యాన అధికారి ఉదయ్కుమార్, ఏవో సున్నం రాంబాబు, ఎస్వో భాస్కరన్, ఏపీవో పవర్ వేణు, ఆర్ వోఎస్ఆర్ డీటీ లక్ష్మినారాయణ, జీసీసీ డీఎం సమ్మయ్య, డీఎస్వో ప్రభాకర్రావు, ఎన్టీఆర్ డీటీ మణిదర్, మేనేజర్ ఆదినారాయణ, సిబ్బంది నరేందర్, సామ్య, జోగారావు, సమ్మక్క పాల్గొన్నారు.

### ట్రైబల్ మ్యూజియం పనులను పరిశీలించిన పీవో

ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం పనులను ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం సందర్శించి పరిశీలించారు . బాక్స్ క్రికెట్, పెయింటింగ్ చిత్రాలను పరిశీలించి మ్యూజియంలో గిరిజనులకు సంబంధించిన ఇలవేల్పులను సాంప్రదాయం ప్రకారం ఏర్పాటు చేసి చరిత్ర పర్యాటకులకు అర్థమయ్యేలా తెలుగుతో పాటు వివిధ భాషల్లో తయారుచేయించడం జరుగుతుందన్నారు. మ్యూజియం పనులు చివరిదశకు చేరుకున్నాయని రాహుల్ పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్రాజ్, ఏపీవో పవర్ వేణు, డీఎస్ వో ప్రభాకర్రావు, డీఈ హరీష్, టీఏ శ్రీనివాసరావు, ఏఈ రవి, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, జేడీఎం హరికృష్ణ, మ్యూజియం ఇన్చార్జ్ వీరాస్వామి, సరస్వతి, సునంద పాల్గొన్నారు.

## దేవుడిపై వివక్ష ఎలా భక్తుడా.?



(మొదటి పేజీ తరువాయి...)
చిన్నతనంలో చెప్పుకునేవారు. మన మండలంలో పురాతనంగా నిర్మించిన ఈ కోదండ రామాలయాన్ని ఎంతో కష్టపడి నిర్మించుకున్నామని గ్రామస్తులు తెలిపారు. ఒక దైవ క్షేత్రంని నిర్మించడం అంటే అంత సులువు కాదని గ్రామస్తులు అంటున్నారు. అయితే అలాంటి దేవాలయాన్ని పట్టించుకోకుండా ఉండడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రామాలయ ప్రాంగణంలో ప్రతి శనివారం వారపు సంత నిర్వహించడం జరుగుతుంది. దాని వేలం పాఠం సంబంధించిన ఆదాయాన్ని రామాలయానికి ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో శుభ్రం చేయడానికి ఒక వ్యక్తిని నియమించి నెలనెలా జీతాలు అందించడమే కాకుండా గుడిని ఎంతో శుభ్రంగా ఉంచుకునే వారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కానీ గత కొన్ని రోజుల నుంచి గుడి శుభ్రం చేయకపోవడం వల్ల చెత్త పేరుకు పోయిందని, దీనివలన ఊరికి ఏమైనా ఇబ్బంది జరుగుతుందా అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎప్పటికప్పుడు రామాలయాన్ని శుభ్రంగా ఉంచి నిత్యం పూజా కార్యక్రమాలు జరిగే విధంగా చూడాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.



# అరుదైన వ్యాధిగ్రస్తుడికి ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 3 యేళ్ళ బాలుడు
- దాతృత్వం చూపిన అరబ్బు దేశంలో స్థిరపడ్డ మీరా
- బాధితుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం



**చర్ల, మార్చి 24 (ప్రజా జ్యోతి):** రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం తమకు కలిగిన సంతానానికి, అరుదైన వ్యాధి సోకడంతో అంతుచిక్కక అప్పులు చేసి మరీ ఆసుపత్రుల చుట్టూ తిరిగితే చివరిగా ఆపరేషన్ చేస్తే తప్ప బాబు చేతికి దక్కడు అనే విషయాన్ని డాక్టర్ల ద్వారా తెలుసుకున్న ఆ కుటుంబం తమ సంతానాన్ని కాపాడుకోవడం కోసం ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తూ వుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,ఆర్ కొత్తగూడెం గ్రామంలోని అతి నిరుపేద కుటుంబానికి చెందిన కణితి రామకృష్ణ,సోని దంపతుల 3 యేళ్ళ కుమారుడు భువిన్ అధ్విత్ రామ్ పుట్టుకతో పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు మల విసర్జన సక్రమంగా జరగకపోవడం,తరచూ అనారోగ్యానికి గురవుతున్న బాలుడిని పిల్లల వైద్యునికి చూపించగా పేగుకి ఇన్ఫెక్షన్ అయ్యింది అని మందులు రాసి ఇస్తే అవి వాడినన్ని రోజులు బాగుండి తర్వాత మళ్లీ మామూలుగానే అనారోగ్యానికి గురయ్యేవాడు .ఇప్పటి వరకు అక్కడక్కడ అప్పు చేసి వైద్యం అందించినప్పటికి,ఆరోగ్యంలో అస్సలు మార్పు రాకపోవడంతో హైదరాబాద్ లోని యశోద ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా,అన్ని పరీక్షలు నిర్వహించిన సంబంధిత వైద్యులు చివరిగా బయోప్సీ పరీక్ష ద్వారా పెద్ద పేగు నమూనా సేకరించి పేగు సంబంధిత వ్యాధిగా నిర్ధారించి,ఇది అరుదైన పేగు వ్యాధి. మందులతో తగ్గే అవకాశం లేనందున, శస్త్ర చికిత్స విధానంతో నయం చేయవచ్చు అని దీని శస్త్ర చికిత్సకుగాను 3,4 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలపడంతో ఆ నిరుపేద కుటుంబం తల్లడిల్లుతోంది. ఈ వ్యాధి ఉన్నట్టుగా ఈ మార్చి నెల 13 వ తారీఖున బయోప్సీ పరీక్ష ద్వారా నిర్ధారణ అయ్యిందని,3 వారాల తర్వాత శస్త్ర చికిత్స కోసం రండి అని సంబంధిత వైద్యులు తెలపడంతో బాధిత కుటుంబం బాలుడిని తీసుకొని ఇంటికి చేరుకున్న నిరుపేద తల్లిదండ్రులు శస్త్ర చికిత్స చేయకపోతే కొడుకు చేతికి దక్కడు అని తెలుసుకొని ఇక దిక్కు లేక సాయం కోసం దాతల సాయం కోసం ఎదురు చూస్తూ స్థానికంగా గల బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ నిర్వాహక బృందాన్ని చరవాణి ద్వారా ఆశ్రయించి సాయం కోరగా,స్పందించిన నిర్వాహకులు డాక్టర్ గాయిత్రి,డాక్టర్ పసుపులేటి ప్రవీణ సహకారంతో అరబ్ దేశంలోని అబుదాబి పట్టణంలో స్థిరపడ్డ వైజాగ్ వాసి మీరా గొప్ప మనసుతో స్పందించి బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం (రూ1,00,000/–) అక్షరాల ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబం యొక్క బ్యాంకు ఖాతాకు ఆన్లైన్ ద్వారా నేరుగా అందించితమ మానవత్వాన్ని పరిమళింపజేసారు.మానవత్వం ఉంటే సాయానికి ఖండాలు,హద్దులు అడ్డు రావు అని మీరా తన దాతృత్వంతో నిరూపించారు.సాయం పొందిన బాధిత కుటుంబం మరియు స్థానికంగా గల బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ నిర్వాహక బృందం (శ్యామల రవి మరియు స్నేహితులు ) ఆర్థిక సాయం అందించిన మీరాకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వ్యాధిగ్రస్త బాలుడి శస్త్ర చికిత్సకు డబ్బు ఎక్కువ మొత్తంలో అవసరమై ఉన్నందున దయా హృదయంతో ఎవరైనా ఆర్థిక సహాయం అందించదలచుకున్నవారు నేరుగా బాదిత కుటుంబానికి అందించగలరని బాలుని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు బాధిత కుటుంబం ఫోన్ నెంబర్ 9063151404.

## పశువులను అక్రమంగా తరిస్తున్న ట్రాలీ పట్టివేత



**టేకులపల్లి, మార్చి24, ప్రజాజ్యోతి :** అనుమతులు లేకుండా ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఐదు పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పి. సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం రాత్రి 9.30 గంటల తడికలపూడిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా క్రమంలో తడికలపూడి క్రాస్ రోడ్ వద్ద,తడికలపూడి నుంచి సూర్యాపేట వెళ్తున్న ఆటో టీఎస్ 29 టీ 2536 నెంబరు గల ట్రాలీని ఆపి తనిఖీలు చేశారు. అందులో అనుమతులు లేకుండా కోడే దూడలు తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం ఆ పశువులు, ఆటో ట్రాలీని పోలీసులు స్వాధీనం చేసుకుని గరుడపల్లి లాలయ్య, మొరంపల్లి నాగరాజు అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోడెదూడలను గోశాలకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

## నమ్మి ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరినట్లే...



(మొదటి పేజీ తరువాయి...)
గో మాతల సన్నిధిలో గోవిందుడు కొలువై ఉండడం నిజంగా ఇంత సుందరమైన క్షేత్రాన్ని మేము ఎక్కడా చూడలేదని, ఈ క్షేత్రంలో అడుగు పెట్టగానే ఎంతో పులకించిపోయామని ఇదంతా స్వామి వారి దయామృత లీలలేనని అన్నారు. దర్శనం కొరకు వచ్చిన జడ్జి కి ఆశ్రమం నిర్వాహకులు డా. కృష్ణ చైతన్య స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో నృసింహ సేవా వాహిని సిబ్బంది భద్రాచలం టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత చాటిన ఇండస్ట్రియల్ యూనియన్

- మరణించిన కట్టల మేస్త్రి కుటుంబానికి ఆర్థిక సాయం



భద్రాచలం టౌన్, మార్చి 24, ప్రజాజ్యోతి: భద్రాచలం ఇండస్ట్రియల్ ఏరియాలో గత 30 సంవత్సరాలుగా కమాన్ కట్టలు మేస్త్రిగా పనిచేస్తు కొన్ని రోజుల క్రితం అకాల మరణం చెందిన ఆకుల బాలరాజు మరణానికి చింతిస్తూ వారి కుటుంబానికి ఇండస్ట్రియల్ యూనియన్ సభ్యులు ఇండస్ట్రియల్ యూనియన్ తరపున ఇండస్ట్రియల్ ఏరియా చైర్మన్ వాతాడి దుర్గారావు చేతుల మీదుగా 39వేల రూపాయలు ఆర్థిక సహాయం వారి కుమారుడు ఆకుల ఆదినారాయణకు అందించారు. యూనియన్ సభ్యులు మాట్లాడుతూ బాలరాజు కుటుంబానికి ఇండస్ట్రియల్ సభ్యులందరూ అండగా ఉంటారని, ఆ కుటుంబానికి అన్నివిధాలా సహాయక సహకారాలు అందిస్తామని అన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాయూనియన్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్సై చంద్రశేఖర్



అన్నపురెడ్డిపల్లి, మార్చి 24, ప్రజా జ్యోతి : ఐపీఎల్ క్రికెట్ ప్రారంభమైన సందర్భంగా చాలామంది యువకులు ఈజీగా డబ్బు సంపాదించడం కోసం క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తా మని అన్నపురెడ్డిపల్లి మండల ఎస్సై చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ తో ఆర్థికంగా దెబ్బతిని ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పో యే అవకాశం ఉందని, కాబట్టి యువత వీటికి దూరంగా ఉండాలని కోరారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వినోదం కోసం ఆడే ఆట ను వినోదంగానే చూడాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100 గానీ, స్టేషన్ నెంబర్ 8712682045 గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

## పెద్దలు స్వయం కృషి తో హిందూ స్మశాన వాటిక సిద్ధం




పాల్వంచ (రూరల్), మార్చి 24,ప్రజా జ్యోతి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపల్ పరిధిలోని నవభారత్ శేఖరాంబంజర్ 16 వ వార్డు లో గ్రామం ఆవిర్భావం నుండి నేటి వరకు స్మశాన వాటిక లేక స్థానిక ప్రజలు సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసిన గ్రామ పెద్దలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎకరం గల ప్రభుత్వ భూమిలో సోమవారం నాడు గుబురుగా వున్న ముళ్ల పొదలను,వేపుగా పెరిగిన పిచ్చి చెట్లను డోజర్ తో తొలగించి శుభ్రం చేసారు,అస్తవ్యస్తంగా వున్న భూమిని ఒక రూపంగా తీసుకువచ్చి స్మశాన వాటిక గా ఊరుకి ఉపయోగపడే విధంగా శ్రమదానం చేసి రూపొందించారు,ఈ సందర్భంగా గ్రామ పెద్ద బాణోత్ బాలు నాయక్ మాట్లాడుతూ స్వంత ఖర్చులతో నిరుపయోగంగా వున్న ప్రభుత్వ భూమిని సహచర గ్రమ పెద్దల సహకారంతో స్వంత ఖర్చులతో స్మశాన వాటికి ను తయారు చేసామని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిధులు కేటాయిస్తే గ్రామ ప్రజలు రుణపడి వుంటారని తెలిపారు,ఈ కార్యక్రమంలో సామా నాయక్ సురేష్ నాయక్,గుగులోత్ బాలు గుగులోత్ రాజు నాయక్, కిషోర్ నాయక్,శేఖర్ నాయక్,రవి నాయక్,ఇస్లావత్ రాజు నాయక్, అనీల్, వెంకటేష్,రాము నాయక్,లింగయ్య నాయక్,లాలు నాయక్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు



అన్నపురెడ్డిపల్లి, మార్చి 24, ప్రజా జ్యోతి ప్రతినిధి : అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో సోమవారం పురస్కరించుకొని ఆలయంలో విశేషంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ధూప సేవ, నాగ హారతి కార్యక్రమాలు అత్యంత వైభవంగా ఆలయంలో నిర్వహించబడింది.. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి మహా ప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృప కు పాత్రులై ఉన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## చలివేంద్రం ప్రారంభం



భద్రాచలం టౌన్, మార్చి 24,ప్రజాజ్యోతి: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో టీజీఎస్ఆర్టీసీ డిపో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో తాగునీటి చలివేంద్రాన్ని ఆర్టీసీ డిపో మేనేజరు తిరుపతి రిబ్బన్ కట్ చేసి సోమవారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు బస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో క్లర్క్ అల్లం నాగేశ్వర్ రావు, సీఐ గౌతమీ, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి : రాష్ట్రంలో బీసీ కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్ లను ప్రతిపాదించి, అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం ఇల్లందు ఏరియా హాస్పిటల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, ఐఎన్టియుసి ఇల్లందు ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ పి. కృష్ణమూర్తి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని ఏఐటియుసి కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె. సారయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాజీవ్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ నాయకులు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరగడం వల్ల నిత్యం పరిసర గ్రామాల నుంచి ఇల్లందు పట్టణానికి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జానిశ్రీనివాస్, సిపిఐ నాయకులు దేవరకొండ శంకర్, బొల్లి కొమరయ్య, కుమ్మరి రవీందర్, చాట్ల గణపతి, కె. సుందర్, అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు



టేకులపల్లి, మార్చి 24, ప్రజాజ్యోతి: మండలం కేంద్రంలోని బోడు ఎక్స్ రోడ్డు చౌరస్తానందు టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల ప్రకారం ఎండలు తీవ్రంగా ఉన్నందున టేకులపల్లి మండలంలో ప్రధాన కూడళ్లు,జనాలు ఎక్కువగా తిరిగి ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలకుండా దాహార్తిని తీర్చడానికి రెండు ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సోముల కళావతి, మాజీ వార్డ్ మెంబర్ సోముల భాను చందర్, సుజాత,నాగమణి,టి.ఉమ,ఎన్.నరేష్,చంద్రమౌళి,యం.సతీష్,బి.నరేష్, పంచాయతీసిబ్బంది మూడు. బిచ్చు, ప్రసాద్, చందు పాల్గొన్నారు.

## రోడ్లపైకి మురుగునీరు చేరుతుంది... సైడ్ డ్రైన్ నిర్మించండి

- జగదీషాకాలనీలో సీపీఎం బృందం సర్వే



భద్రాచలంటౌన్, మార్చి 24 ప్రజాజ్యోతి: పట్టణంలోని జగదీషాకాలనీ శివారు ఎల్బీజీనగర్ గుట్టపై ఉన్న ప్రాంతంలో డ్రైనేజీ నిర్మించకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి వచ్చి తీవ్ర దుర్వాసన వస్తుందని ప్రజలు, పిల్లలు రోగాల బారిన పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సోమవారం జగదీషాకాలనీ శివారు ప్రాంతంలో సీపీఎం బృందం సమస్యలపై సర్వే నిర్వహించిందన్నారు. మిషన్ భగీరథ పైపులు వేయకపోవడంతో మంచినీరు అందడంలేదని వాపోయారు. వీధిలైట్లు కూడా వేయడంలేదని, రేషన్కార్డులు, పింఛన్లు, ఇంటి పన్నులు తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాఐక్యతతో కృషి చేస్తామని స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కన్వీనర్ సీతాలక్ష్మి, శాఖా కార్యదర్శి డి.రామకృష్ణ, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కృషితో నాస్తి దుర్భిక్షం

- రేగళ్ల తండా గిరిజనుడికి ఉగాది ఉత్తమ పురస్కారం
- గుగ్లూత్ రూప్ల కు సేవా రత్న అవార్డు



**లక్ష్మీదేవి పల్లి, మార్చి 25, ప్రజా జ్యోతి:** సమాజంలో తాను అందిస్తున్న అనేక సేవా కార్యక్రమాలకు సర్వేజనా సుఖినోభవంతు సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ వారి 8వ వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల పెద్ద తండాకు చెందిన గుగ్గులోతు రుప్లా నాయక్ ఉగాది జాతీయ పుర స్కారంలో భాగంగా సేవా స్వర్ణ నంది విశ్వ వాసు ఉగాది జాతీయ స్థాయి పుర స్కారాల ప్రధాన మహోత్సవం 2025లయన్ డాక్టర్ సూర్యనారాయణ మాస్ట రు ఆధ్వ ర్యంలో సేవ రత్న పుష్కారాన్ని అందజేశారు. ఈ అవార్డును ఆదివారం సుందర య్యవైజ్ఞానిక వేదిక బాగ్ లింగంపల్లి హైదరాబాద్ నందుముఖ్య అతిథి జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య హైకోర్టు (రి) జడ్జ్ చైర్ పర్సన్ (రి) రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తెలంగాణ హైదరాబాద్ విశిష్ట అతిథి: లయన్ డాక్టర్ జి మ హేంద్ర కుమార్ రెడ్డి ,ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్, డిస్టిక్ 320ఏ గౌరవ అతిథి కళారత్న లయన్ డాక్టర్ ఎస్పీ భారతి కూచిపూడి నాట్య గురు వులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ మెంబర్ న్యూఢిల్లీ చేతుల మీదుగా అం దుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోసభాధ్యక్షులు,మందడి కృష్ణారెడ్డి జాతీయ విని యోగదారుల మండలి అధ్యక్షులు (కేంద్ర ప్రభుత్వ సంస్థ) పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఉచితంగానే ఇండ్ల స్థలం పంపిణీ చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణం:** జర్నలిస్టులకు ఉచితంగానే ఇండ్ల స్థలం పంపిణీ చేయాలని , జర్నలిజం వృత్తిలో నిత్యం ఆనేక ఓడిదుడు కులు ఎదుర్కొంటూ ప్రజా సంక్షేమం కోసం , సమాజాన్ని మేల్కొలిపేలా వార్తలు రాస్తూ, చాలి చాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న జర్నలిస్టు లకు ఇండ్ల స్థలం కోసం కోట్ల రూపాయలు చెల్లించాలని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా అని ప్రశ్నించారు. సమాజ హితం కోసం పాటు పడుతున్న విలేకరులకు నగదు చెల్లించి స్థలం కొనుక్కోమని చెప్పడం దారుణమని ఇకనైనా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉచితంగా ఇండ్ల స్థలం తో పాటు ఇందిరమ్మ ఇంటిని సైతం మంజూరు చేయాలని, ఈ అంశంపై అసెంబ్లీ లో ప్రస్థావించేలా మా పార్టీ శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. జర్నలిస్టు ల శిబిరానికి హాజరై మద్దతు తెలిపిన వారిలో పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్, నాయకులు జెల్లరపు శ్రీనివాస్, చింతల చెర్వు శ్రీనివాస్, పాల్వంచ మండల అధ్యక్షుడు రాపాక రమేష్, గుంపుల మహేష్, ఏ. శరత్ బాబు, లక్ష్మీ దేవి పల్లి మండల అధ్యక్షుడు మాలోతు గాంధీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**టేకులపల్లి, మార్చి 24, ప్రజాజ్యోతి :** మండలంలోని శంభుని గూడెం వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను సోమవారం పట్టుకున్నట్లుగా టేకులపల్లి ఎస్సై పి. సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ సిబ్బందితో కలిసి ముత్యాలంపాడు క్రాస్ రోడ్, సులానగర్ గ్రామాల మధ్య పెట్రో లింగ్ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి పత్రాలు లేక పోవడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేనట్లు గుర్తించినట్లు పేర్కొ న్నారు. ఈమేరకు ట్రాక్టర్ను పోలీస్ స్టేషన్కు తరలించి ట్రాక్టర్ యజమాని అజ్మీర మాన్సింగ్ తో పాటు డ్రైవర్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది

- 15 నెలల కాలంలో భద్రాచలం అభివృద్ధికి కాంగ్రెస్ చేసింది శూన్యం
- బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్



**భద్రాచలం, మార్చి 24, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మండిపడ్డారు. సోమవారం పట్టణంలో అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరైతే వాళ్లు ప్రారంభించినట్లు గొప్పలు చెప్పడంతో పాటు డంపింగ్ యార్డు ప్రారంభించి కూడా గొప్పలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 15 నెలల కాంగ్రెస్ హయాంలో భద్రాచలం పట్టణ అభివృద్ధికి శాశ్వత పరిష్కారం కాంగ్రెస్ ఏం చూపిందని, ఏం అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. పట్టణ ప్రజలకు ఇసుక కొరత లేకుండా ఎప్పుడు పరిష్కారం చూపు తారని, కరకట్ట మధ్యలో ఆగినట్లేనా అని, కేసీఆర్ హయాంలో రూ.38 కోట్లు కరకట్ట నిర్మాణానికి ఇచ్చిన నిధులు తప్ప కాంగ్రెస్ కరకట్టకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, దుమ్ముగూడెం మండలం తూరుబాక వంతెన కూలిపోయి ఇప్పటికీ ఏడుగురు మరణించారని, వెంకటాపురం మండలంలో ఇసుక లారీల లోడు తట్టుకోలేక మరో వంతెన కూలిపోయిందని, కనీసం నూతనంగా వంతెనలు నిర్మాణానికి అధికార ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా డైవర్షన్ రోడ్లు వేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కరించాలే కానీ ప్రచార ఆర్భాటాలు తగ్గించి ప్రజల పై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, కోకన్వీనర్ రేపాక పూర్ణచందర్రావు, సీనియర్ నాయకులు కొల్లం జయప్రేమకుమార్, దుమ్ముగూడెం మండల నాయకులు బొల్లి వెంకట్రావు, కాలువ పూర్ణయ్య, కొత్త మల్లేష్, భక్తుల నర్సింహులు, అంబటికర్ర కృష్ణ, ఇమంది నాగేశ్వరరావు, డానియేల్, ప్రదీప్, ఖాదర్, కొలిపాక శివ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి 6 నెలల జైలుశిక్ష

**భద్రాచలం, మార్చి 24, ప్రజాజ్యోతి :** భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి శివనాయక్ సోమవారం చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి 6 నెలల జైలుశిక్ష, రూ.2.60 లక్షలు జరిమానా విధించారు. బూర్గంపహాడ్ మండలం సారపాకకు చెందిన జాదవుల కనకయ్య వద్ద బయ్యారానికి చెందిన నాగారపు వెంకటేశ్వర్లు చెక్కు హామీగా పెట్టి రూ.2.60లక్షలు తీసుకున్నాడు. ఆ చెక్కు బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. సదరు జాదవుల కనకయ్య కోర్టులో కేసు వేయగా కోర్టులో వాదోపవాదాల అనంతరం ముద్దాయి వెంకటేశ్వర్లుకు 6 నెలల జైలుశిక్షతో పాటు రూ.2.60 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుడు తరపున ప్రముఖ న్యాయవాది ముత్యాల కిషోర్ కేసు వాదించారు.

# నేడు వారపు సంత వేలం పాట

**టేకులపల్లి, మార్చి24, ప్రజాజ్యోతి :** మండలంలోని టేకులపల్లి, గోలియా తండ ఉమ్మడి గ్రామపంచాయతీల సొంత వేలం పాట ఈనెల 25వ తేదీన మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పంచాయతీ అధికారి ఆధ్వ ర్యంలో గోలియా తండా ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించబడును. మొదటగా వేలంలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీ ఎ టువంటి బాకీ ఉండరాదని, అలా ఉన్నచో వాళ్ళు అనర్హులుగా నిర్ణయించా రు. వేలంపాటకు ముందుగా 10 గంటల సమయంలో 50వేల రూపా య లను డిపాజిట్ చేయాలని తెలిపారు. సంతకాల పరిమితి ఏప్రిల్ 1వ 2025 నుండి మార్చి 31 2026 సంవత్సరం వరకు ఈ కాల పరిమితి ఉం టుందని తెలిపారు. వేలంపాట దక్కించుకున్న వ్యక్తి 25వ తేది సాయంత్రం ఐదు గం టల లోపు నగదును చెల్లించాలి. పాట పొందినవారు 24 గం.ల లోపు రూ. 100/– అగ్రిమెంట్ బాండ్ వారి సొంత ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వవ లెను. వేలం జరుగుచున్నప్పుడు ఏ వ్యక్తి అయిన తమ అనుచిత ప్రవర్తనతో అ వాంతరములు కలిగిస్తున్నట్లు భావించబడినచో అట్టి వ్యక్తిని వేలం పాట నుండి బహిష్కరించడం జరుగుతుంది. పైగా వారిపై కేసు నమోదు చేయుట కు వేలం వేయు ఉద్యోగికి అధికారం కలదు అని తెలిపారు. రశీదు పుస్తకములు వేల పొందిన వారు సొంత ఖర్చులతో ముద్రించి గ్రామపంచా యతీ వారి ధృవీకరణ తో నిర్వహించవలెను. పంచాయతీ నిర్ణయించిన ధరల ప్రకారమే పశువుల రుసుము.

# కార్మికుల పని వేళలు మార్చాలి



**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కాంట్రాక్టు కార్మికుల కార్మికుల పని వేళలు మార్చాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి కోరారు. సోమవారం ఇల్లందు ఏరియా జియంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు మజ్జిగతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఇల్లందు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, బ్రాంచి కార్యదర్శి కొత్తపల్లి రఘు, రైల్వే యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, యాకుబ్ వలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



**భద్రాచలం కల్చరల్ , మార్చి 24, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్కు చెందిన భక్తులు రూ.30 లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజాము త ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడామండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

# ప్రాథమిక విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

- విద్యా సంవత్సరం నుంచి ఏఐ పాఠాలు ఎంఈఓ జగన్

**టేకులపల్లి, మార్చి 24, ప్రజాజ్యోతి :** ప్రాథమిక స్థాయిలోనే పిల్లల్లో విద్యాభోధన పునాదిగా మారుతుందని టేకులపల్లి ఎంఈఓ ఎ.జగన్ అన్నారు. సోమవారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని ఉచితంగా ఇస్తున్నారని, గతంలో కంటే ఎన్నో మార్పులు వచ్చాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ద్వారా విద్యాబోధన జరుగుతుందని, ఈ అవకాశం ద్వారా విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. స్కూల్ హెచ్ఎం, ఎం. జ్యోతిరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీచర్లు జర్పల పద్మ, నీరజ షారోన్, సి ఆర్ పి అబ్బయ్య పాల్గొన్నారు.



# ఆదివాసీల అస్తిత్వం కోసం ఐక్యంగా ఉద్యమిస్తాం

- **ఆదివాసి సంఘాల ఐక్యవేదిక**



**భద్రాచలం టౌన్, మార్చి 24(ప్రజాజ్యోతి):** ఆదివాసీల అస్తిత్వాన్ని నీరుగార్చేలా కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నారని వారి కుట్రలను భగ్నం చేసేలా ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ, అస్తిత్వాన్ని కాపాడడం కోసం అందరు కూడా ఐక్యంగా కలిసి ముందుకు సాగుతామని ఆదివాసి సంఘాల ఐక్యవేదిక(జేఏసీ)నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో ఆదివాసి జేఏసీ నాయకులు, అడ్వకేట్ పాయం రవివర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసి సీనియర్ నాయకులు పూనెం వీరభద్రం మాట్లాడుతూ అర్హతలేని కొన్ని కులాలు షెడ్యూల్ ట్రైబ్స్ గా చలామణి అవుతూ మేమే అసలైన షెడ్యూల్ ట్రైబ్స్ అనే విధంగా వ్యవహరిస్తూ, అసలైన ఆదివాసీ తెగలు కోయ, కొండ రెడ్డి, నాయకపోడు తెగలను విస్మరిస్తూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అదే విధంగా ఆదివాసి నాయకులు ముర్ల రమేష్ దొర మాట్లాడుతూ అసలైన ఆదివాసి తెగల దేవతలను, సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తెలిసే విధంగా కృషి చేస్తున్న ఐటిడిఏ అధికారులకు కృషి అభినందనలు తెలుపుతూ, ఈ విధంగా కృషి చేస్తున్న అధికారులకు సంఘాల ఐక్యవేదిక ఎప్పటికీ పూర్తి సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పూనెం కృష్ణ దొర, పూనేం నాగేశ్వరరావు, వీసాల కృష్ణయ్య, కల్లూరి జయబాబు, కొండ్రు సుధారాణి, కుంజా రమాదేవి, జగ్గ పుల్లయ్య, చిచ్చడి సత్యనారాయణమూర్తి, కోర్స చిన్నబాబు దొర, ఉమ్మల దుర్గారెడ్డి, సోంది రవికుమార్, వాసం వీరభద్రం మరియు ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడితే కఠిన చర్యలు

- **ఎస్సై రాజేష్**



**బూర్గంపహాడ్,మార్చి 24(ప్రజా జ్యోతి):** క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ అన్నారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ చట్ట విరుద్ధమని ఇది ఆర్థికంగా, సామాజికంగా జీవితాలను నాశనం చేస్తుందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.క్రికెట్ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. శ్రమించకుండా వచ్చే నగదు వెనుక అనేక నష్టాలు దాగి ఉండడంతో పాటు కేసుల్లో నిందితులుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని కోరారు. మండల వ్యాప్తంగా బెట్టింగ్ లపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని కావున పిల్లలపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బెట్టింగ్ కార్యకలాపాల గురించి సమాచారం అందించాలని, డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సంత వేలం గిరిజనులకా, బినామీలకా

- **గిరిజన ముసుగులో పాల్గొనే బినామీ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి :జి ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు పాయం.**

**చర్ల, మార్చి 24( ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన చర్ల గ్రామపంచాయతీలో ది 26/ 3/ 2025 నాడు బహిరంగ సంత వేలం పాట నిర్వహించుటకు సంబంధిత అధికారులు షెడ్యూల్ విడుదల చేశారని.ఈ యొక్క సంత వేలంపాట షెడ్యూల్ ఏరియా పీసా చట్టం రూల్స్ ప్రకారంగా నిర్వర్తించి ఆదివాసి నిరుద్యోగులకు అవకాశం కల్పించి ఉపాధి పొందే విధంగా అధికారులు కృషి చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ సూచించారు, ఈ సందర్భంగా సోమవారం నాడు ఎంపీడీవో ఆఫీసులో చర్ల పంచాయతీ సెక్రటరీ సురేష్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ప్రతి సంవత్సరం పాట సమయంలో అడే బుడే అమాయక గిరిజనులను పట్టుకొని వారి ద్వారాగా గిరిజనుల తరుపున డీడీలు కట్టించి పాటలో పాల్గొని బినామీలుగా చలామణి అవుతున్నారని,అలాంటి వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈసారి బినామీలు సంతలో ప్రవేశిస్తే మాత్రం ఆదివాసులు తిరగబడి వారిని కట్టడి చేస్తారని,అధికారులు కూడా ఏజెన్సీ రూల్స్ ప్రకారంగా సంత వేలంపాట నిర్వర్తించి పూర్తిగా ఆదివాసులు ఉపాధి పొందే విధంగా పాటను నిర్వహించి వాళ్ళకి న్యాయం చేయాలని కోరారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో పూనెం వరప్రసాద్ జీఎస్పి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇర్పా ప్రకాష్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు సరేం.రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు



# ఖాజా గౌస్ కు ఘన సన్మానం



**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** ఏఐసిసి అనుబంధ కిసాన్ ఖేత్ నేషనల్ కో – ఆర్డినేటర్ గా నియమితులైన ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ కార్యదర్శి, ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్ ను సోమవారం 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఖాజా గౌస్ మోహినుద్దీన్ కు ఏఐసిసి అనుబంధ కిసాన్ ఖేత్ నేషనల్ కో – ఆర్డినేటర్ గా నియమితులవ్వడం సంతోషకరమన్నారు. ఖాజా గౌస్ మోహినుద్దీన్ కు రానున్న రోజుల్లో పార్టీలో మరెన్నో పదవులలో ఉండాలని ఆకాంక్షించారు. ఏజెన్సీ మారుమూల ప్రాంతమైన ఇల్లందు ప్రాంతానికి చెందిన ఖాజా గౌస్ మోహినుద్దీన్ ఏఐసిసి స్థాయిలో పదవి దక్కించుకోవడం 7వ వార్డుకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపగాని రాజు గౌడ్, మారగాని శ్రీనివాస్ గౌడ్, యండి. ముజిబ్, కంటె రాజు, సలెంద్ర వెంకన్న, కాటిక శ్రీనివాస్, గడ్డం రాములు, అక్షయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆదివాసీ క్రికెట్ టోర్నీ



**బూర్గంపహాడ్,మార్చి 24(ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల ఆదివాసీ సంఘం నేతృత్వంలో గత వారం రోజులుగా వేపలగడ్డ గ్రామంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ టోర్నీలో ప్రథమ బహుమతి కోమరంభీం టీమ్ వేపలగడ్డ టీం గెలవగా, ద్వితీయ బహుమతి మహేష్ టీమ్ –కోయగూడెం,తృతీయ బహుమతి విఐపీ స్టార్స్ వేపలగడ్డ టీంలు గెలుచుకున్నాయి. ఈ బహుమతులను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ మండల అధ్యక్షులు తాటి సత్యనారాయణ,వేపలగడ్డ మాజీ సర్పంచ్ కుంజా చిన్నబ్బాయి, ఉప్పసాక మాజీ సర్పంచ్ పాయం వెంకటేశ్వర్లు,నకిరిపేట మాజీ సర్పంచ్ సర్పా వెంకటేశ్వర్లు,గ్రామ పెద్దలు తాటి వెంకటేశ్వర్లు,కుంజా కృష్ణ, ఎడమ రామారావు, మాజీ వార్డు సభ్యులు కుంజా రాంబాబు,మేనేజ్మెంట్ సభ్యులు మెండి భాస్కర్, దనసరి శ్రీను, బొర్రా వీర్రాజు, తాటి రామారావు, కాకా రవి, స్థానిక ఆదివాసీ యువత కుంజా ప్రవీణ్ కుమార్, షకీల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.